

# సాహితీమూర్తుల సహవాసం

## – నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

## 10

# తెలుగు సాహిత్య సౌరభాలను ప్రపంచానికి చాటి చూపిన ధూళిపూడి ఆంజనేయులు(1924-1998)



తెలుగు రానివారికి, వచ్చినా చదవలేనివారికి ఆధునిక తెలుగు సాహిత్యపు సౌరభాలు విరజిమ్మిన ధూళిపూడి ఆంజనేయులు తెలుగులో ఏమీ రాయలేదు. రాసిందంతా ఇంగ్లీషులోనే ఉన్నది. అదీ ఆయన ప్రత్యేకత. పుట్టింది సిసలైన తెలుగు గ్రామం మోపర్రులో (తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా) తొలి చదువు తురుమెళ్ల స్కూలులో. ఉన్నత విద్య మదరాసులో. ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖలో విదేశీ పత్రికలో ఎడిటర్ గా ఢిల్లీ నుండి పనిచేశారు. అదే శాఖలో ప్రసార సాధనాల విభాగంలో హైదరాబాదులో చేశారు. ఆలిండియా రేడియోలో కొన్నాళ్ళు కృషి చేశారు. ఉద్యోగ రీత్యా ఇలాంటివి ఎన్ని చేసినా సాహిత్యాభిమానాన్ని కొనసాగిస్తూ, వ్యాసాలూ, పుస్తకాలూ రాశారు. మదరాసులో వుండగా

హిందు ఇంగ్లీషు దినపత్రికలో ప్రతివారం 'బిట్వీన్ యు అండ్ మి' అనే శీర్షికన కొన్నేళ్ళు రాశారు. మదరాసులోనే పత్రికా రచయితల సంఘంలో కూడా బాగా శ్రద్ధ వహించి పనిచేశారు.

ఆంజనేయులు మితభాషి. సున్నిత సంభాషణ చేసేవారు. అతి సున్నితమైన హాస్యం రచనలలో చూపేవారు. అయితే ఆయన తెలుగు సాహిత్యాన్ని ఔపోసనం పట్టారు. తెలుగులో ఎందుకు రాయలేదో తెలియదు గానీ, తెలుగు రచయితలను తెలుగు సాహిత్య లోతుపాతులను అనేక వ్యాస రూపాలుగా పుస్తకాలుగా రాసి ఎనలేని సేవ చేశారు. ఇంచుమించు అదేధోరణిలో సుప్రసిద్ధ తెలుగు జర్నలిస్టుల గురించి కూడా రాశారు. అందులో సి.వై. చింతామణి, కోటంరాజు పున్నయ్య, కుందుర్తి ఈశ్వర దత్తు, కోటం రాజు రామారావు, ఎం. చలపతి రావు, నార్ల వెంకటేశ్వరరావుపై మంచి జీవిత వివరాలతో అంచనాతో కూడిన వ్యాసాలు రాశారు. ఎన్నో సాహిత్య సభలలో పాల్గొని అనుభవాలను పంచుకున్నారు.

ఆంజనేయులు ఆదిలక్ష్మిని వివాహం చేసుకున్న తరువాత ఆమె రష్యాలో భారతీయ విభాగపు రేడియోలో పనిచేసింది. ఆమె పనిచేస్తుండగా ఆంజనేయులు యూరోప్ అంతా పర్యటన చేశారు. ఆ పర్యటన అనుభవాలను అందరివలె కాక చాలా చక్కని మార్గదర్శకాలుగా 'విండో టు ది వెస్ట్' అనే శీర్షికన రాశారు. మాస్కోలో పనిచేస్తున్న ఆదిలక్ష్మి ఒకమ్మాయిని ప్రసవించింది. కానీ ఆంజనేయులను విచార ప్రపంచంలో వదిలేసి ఆమె అక్కడ మరణించింది. అప్పుడు సోవియట్ కమ్యూనిస్టు ప్రభుత్వం ఆ పసిపాపను పెంచే బాధ్యత స్వీకరించింది. ఆ పాపకు సాన్యా అని పేరు పెట్టారు. ఆంజనేయులు తన బిడ్డను కొన్నేళ్ళు అక్కడ పెరగనిచ్చి మదరాసు తీసుకు వచ్చి, తన దగ్గరే అట్టిపెట్టుకున్నారు. ఆమెకు శాంతిశ్రీ అని పేరు పెట్టుకున్నారు. ఆమెకు యుక్తవయస్సు వచ్చిన తరువాత సోవియట్ పౌరురాలిగా అట్టిపెట్టుకుంటారా? లేక మీ దగ్గరే వుంచుతారా అని ప్రభుత్వం అడిగింది. ఆంజనేయులు తన దగ్గరే అట్టిపెట్టుకుంటామని చెప్పేసరికి అక్కడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ అమ్మాయి పేరిట బాంకులో జమకూడిన డబ్బును ఆంజనేయులుగారికి అప్పగించేశారు. శాంతిశ్రీ తండ్రికి దీటుగా మేధావిగా పరిణమించి పూనా యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా ఉన్నది.

నిరంతర రచనలు సాగించిన ఆంజనేయులు సుప్రసిద్ధ సంఘసంస్కర్త, రచయిత, పరిశోధకులు, కందుకూరి వీరేశలింగంపై చక్కని గ్రంథాన్ని వెలువరించారు. ఇంచుమించు అదే స్థాయిలో కట్టమంచి రామలింగారెడ్డిపై మోనోగ్రాఫ్ రాశారు. అలా రాస్తున్నప్పుడు నా సహాయం కూడా కోరారు. యధాశక్తి నేను తోడ్పడగా తన ప్రచురణలో నాకు ధన్యవాదాలు చెప్పారు. తరువాత 'ఆథర్ యాజ్ ఆర్టిస్ట్' అనే ఆయన రచన సాహిత్య విమర్శలో చక్కని స్థాయిని సమకూర్చుకున్నది. ఆయన ఎంపిక చేసుకున్న విషయమే ఆకర్షణీయమైనది. తరువాత జీవితచరిత్రలు రాయటంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించవలసిన పద్ధతులు ఉన్నత స్థాయిలో చెబుతూ 'ది ఆర్ట్ ఆఫ్ బయోగ్రఫీ' రాశారు. నెహ్రూ జీవితచరిత్ర నిశిత పరిశీలన గావించారు. నిరాద్ చౌదరి రచనలు ఆయనకు ప్రత్యేక ఆకర్షణ. సాహిత్య విమర్శలో ప్రమాణాలను విశదీకరిస్తూ దేశ విదేశాలలోని స్థాయిని పాఠకులకు చూపారు. ఎందరో రచయితలు అనేక అంశాలు ఇంగ్లీషులోకి అనువాదం చేసిన తీరును ఆంజనేయులు పరిశీలించి అనువాదాలు ఎలా వుండాలి అనే అంశం కూడా రాశారు.

### తెలుగు సాహిత్యంపై ఆదర్శప్రాయమైన రచన

కలకత్తాలోని రైటర్స్ వర్క్ షాప్ వెలువరించిన యాస్పెక్ట్స్ ఆఫ్ తెలుగు లిటరేచర్ (Aspects of Telugu Literature) తెలుగు సాహిత్య ధోరణులు ప్రచురించారు. అదొక ప్రమాణ గ్రంథంగా తెలుగేతర పాఠకులు స్వీకరించారు. ఇందులో మార్గదర్శకులను ఉన్నత స్థాయిని చేరుకున్న వారిని దృష్టిలో పెట్టుకుని రాశారు. ఆయన తన రచనకు స్వీకరించిన పేర్లు ఆయన ధోరణికి అద్దం పడతాయి. తెలుగు వారికి తొలి నిఘంటువు అందించిన సి.పి.బ్రౌన్ అందులో ఒకరు. తెలుగు వారికి ఏదో ఒక విధంగా ఇంటింటి రచయితలుగా, కవులుగా మారిన బమ్మెర పోతన, వేమన, క్షేత్రయ్య ఆయన విశ్లేషణకు గురయ్యారు. తరువాత కందుకూరి వీరేశలింగం, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, సి.నారాయణరెడ్డి, దాశరథి, ఆలూరి బైరాగి, పి.వి.రాజమన్నార్, భమిడిపాటి కామేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, నండూరి సుబ్బారావు. ఇల్లిందల సరస్వతీదేవి, ద్వివేదుల విశాలాక్షి, కట్టమంచి రామలింగారెడ్డి, గిడుగు సీతాపతి, తాపీ ధర్మారావు, శ్రీవాత్సవ, ముట్నూరి కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.

అటు విదేశాలలోని తెలుగువారు గానీ, తెలుగు రాని మరెవరైనా గాని ఈ రచనను స్వీకరిస్తే తెలుగు సాహిత్యసారాన్ని పిండి చూపినట్లనిపిస్తుంది. చివరి దశలో విప్లవ కవులు, మరికొన్ని కవితా ధోరణులు, అలా చూపి వదిలేశారు. వీటిలో సంక్షిప్తంగానైనా ఒక్కొక్క రచయిత ధోరణులను శైలిని, రామణీయకతలను, సాహిత్య మాధుర్యన్ని, చదివించేటట్లు ఆంజనేయులు పరిచయం చేశారు. ఇది తెలుగు భాషకు బాగా ప్రచారం తెచ్చిపెట్టే ఇంగ్లీషు రచన.

ఆంజనేయులు, తన రచనను సుప్రసిద్ధ రచయిత విమర్శకుడు పత్రికా సంపాదకుడు, రాజ్యసభ సభ్యుడు నార్ల వెంకటేశ్వరరావుకు అంకితం చేశారు.

మరొక విశేషం ఏమంటే నార్ల వెంకటేశ్వరరావు తన ఇంగ్లీషు రచనలను ఆంజనేయులుకి ఇచ్చి ఆయన పరిశీలన విమర్శ, దిద్దుబాట్లు, అయిన తరువాతనే ప్రచురించేవారు. అది ఆయన ప్రతిభకు గుర్తింపు. అత్యంత అధునాతన రచయితల వరకు ఎప్పటికప్పుడు తన పరిశీలనను చేస్తూనే పోయిన ఆంజనేయులు అనేక సాహిత్య, జర్నలిస్టు సభలలో పాల్గొని ప్రసంగించేవారు. ఇంట్లో చక్కని గ్రంథాలయాన్ని అమర్చుకున్నారు కూడా. మరొక్క విశేషం ఆయన సంగీత ప్రియుడు. క్లాసికల్ మ్యూజిక్ పట్ల బాగా అభిమానంగా వుండేవారు. కచేరీలకు వెళ్ళి, ఆస్వాదించేవారు. ఆయనతో 1960 నుండి పరిచయం పెరగటమే కాక, సన్నిహితంగా కుటుంబ మిత్రుడుగా ఉండగలగటం నా జీవిత విశేషాలలో ఒకటి.

### విశ్వనాథ

ఆంజనేయులు తన రచనలలో విశ్వనాథ సత్యనారాయణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, పరిశీలన చేశారు. విశ్వనాథ చేబట్టని సాహిత్యప్రక్రియంటూ లేదని ప్రపంచంలోనే ఏ సాహిత్యవేత్తతోనైనా పోల్చి ఆయన రాసిన బృహత్తర సాహిత్యాన్ని గుర్తించవచ్చన్నారు. విమర్శను విపరీతంగా ఎదుర్కొన్న విశ్వనాథ తన అభిప్రాయాలు కూడా అంతే ఘాటుగా వెల్లడించారు అన్నారు.

ఎవరికి ఇష్టమున్నా లేకపోయినా విశ్వనాథను అశ్రద్ధ చేయటానికి మాత్రం వీలులేదన్నారు. విశ్వనాథ రచనలలో సాహిత్య ప్రసంగాలలో వ్యక్తమయిన కొన్ని విషయాలను ఆంజనేయులు ప్రస్తావించి అది వివాదాలకు ఎలా దారితీశాయో ఉదాహరణగా చూపారు. మచ్చుకు:

- ఆంధ్రులు భారతీయులలోనే ఉన్నత స్థాయికి చెందిన సంస్కృతీపరులు. యూరోపు వారు ఆటవికులు.
- ఇంగ్లీషు విద్య భారతీయ సంస్కృతిని పతనం చేసింది.
- నన్నయ, తిక్కనలతో మధుర రచనలతో పోల్చితే, షేక్స్ పియర్ రచనలు అతి మోటుగా వ్యక్తమయినవి.
- భారతదేశ చరిత్రని రాసిన బ్రిటిష్ వారు అబద్ధాలకోరులు.
- ఇంగ్లీషు రచయితలతో పోల్చితే కొవ్వలి రచనలు స్వీకరించదగినవి.
- తెలుగువారు, ప్రపంచంలోనే ప్రత్యేక జాతి. అన్ని భాషలకు వెలుగు చూపగల తెలుగు మాధుర్యం కవితలో చాలా గొప్పది.
- హిందువుల కులవ్యవస్థ అత్యంత అద్భుతమైనది.
- ఇలాంటి భావాలు విశ్వనాథ ధైర్యంగా వెల్లడించారు. అతన్ని అర్థం చేసుకోవడానికి ఈ భావాలు తోడ్పడ్డాయి. (గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ -పేజి 57-58).

## శ్రీశ్రీ



కొత్తదనం మానవాళి కలిపితే కవిత్వం అవుతుందని శ్రీశ్రీ భావంగా ఆంజనేయులు భాష్యం చెప్పారు. 1930 ప్రాంతాలలో ఆంధ్రా యూనివర్సిటీలో లైబ్రేరియన్ గా పనిచేస్తున్న అబ్బూరి రామకృష్ణారావు లండన్ లోని ప్రోగ్రసివ్ రైటర్స్ అసోసియేషన్ ప్రణాళిక శ్రీశ్రీకి అందించారు. ఇది జరిగిన తరువాతనే శ్రీశ్రీ మార్క్సిస్ట్ గా మారాడన్నారు. మహాప్రస్థానం, మరో ప్రపంచం రాసిన చాలా కాలానికి గానీ కమ్యూనిస్టు పార్టీలు వాటిని గుర్తించి ప్రచారంలోకి తేగా శ్రీశ్రీకి మంచి పేరొచ్చిందన్నారు. 1972లో కేంద్ర సాహిత్య అకాడమీ ఇచ్చిన అవార్డును బహిరంగంగా తృణీకరించిన శ్రీశ్రీ చాటుగా వెళ్ళి ఆ డబ్బుతెచ్చుకోవడాన్ని చూపి సిద్ధాంతాలకు తగ్గట్టుగా ఆచరించలేదన్నారు.

**తాపీధర్మారావు**

పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు, దేవాలయాలమీద బూతుబొమ్మలెందుకు? అనే రచనలతో యువతలను ఆకట్టుకున్న తాపీ ధర్మారావు 'హృదయోల్లాసం' రాసి అనేక దశాబ్దాలు వెల్లడించకుండా అట్టిపెట్టుకున్నారని 1968లో అది ప్రచురితం కాగా సాహిత్య అకాడమీ దానికి గుర్తింపు ఇచ్చిందని ఆంజనేయులు వెల్లడించారు.

**సి. నారాయణ రెడ్డి**

ఉపన్యాసకుడుగా పరిశోధకుడుగా పేరొందిన నారాయణ రెడ్డి సినిమాలకు రాసిన పాటలు మాటల వలన మంచి పేరు తెచ్చుకున్నాడన్నారు.

**వి. ఆర్. నార్ల**

మాటామంతీ పిచ్చాపాటి వ్యాసాలు రాసిన నార్ల జర్నలిస్టుగా సుప్రసిద్ధుడని నార్లమాట మకుటంతో పద్యాలు బాగా ఆకట్టుకున్నాయని కొత్తగడ్డ నాటకాలు ప్రదర్శనయోగ్యంగా సమాజంపై ముద్ర వేశాయని అన్నారు. మానవవాదిగా పరిణమించిన నార్లను పాఠకులకు చూపారు.

స్త్రీ రచయిత్రులలో నమూనాగా ద్వివేదుల విశాలాక్షి, ఇల్లిందల సరస్వతీదేవిని సంక్షిప్తంగా ప్రస్తావించారు. స్థలాభావం వల్ల మిగిలిన రచయిత్రులను చూపలేకపోయానన్నారు. ఆధునిక తెలుగు కవితా ధోరణులు అతి సంక్షిప్తంగా మార్క్సిస్టు సోషలిస్టు అతివాద ధోరణులు పై పైన ప్రస్తావించారు. కథలలో యండమూరి వీరేంద్రనాథ్ వరకు ఎవరు ఎలాంటి ప్రక్రియలు చేస్తున్నదీ గమనించారు. దిగంబర కవుల ప్రస్తావన తెచ్చి శ్రీపాద గోపాలకృష్ణమూర్తి చేసిన నిశిత పరిశీలనలను గమనించమన్నారు. ఆ విధంగా తెలుగు సాహిత్య పురోగతిని ఒక శతాబ్దం పాటు జరిగిన పరిణామాలను ఆంజనేయులుగారు అతి చాకచక్యంగా లోకానికి వెల్లడించారు.

తెలుగు సాహిత్యపు ప్రక్రియలు ప్రముఖుల రచనలు ధోరణులు ఎవరికైనా చూపాలంటే నిస్సంకోచంగా ఆంజనేయులుగారి రచనలు రికమండు చేయవచ్చు.

ఆంజనేయులుగారితో సన్నిహితత్వం ఎంతో అనుభవాన్ని సమకూర్చగా ఎందరినో కలుసుకొనటం చర్చలు జరపటం ఒక పెద్ద సదవకాశం. మదరాసులో ఆయన వుండగా ఎన్నోసార్లు వెళ్లి హాయిగా సాహిత్య చర్చలు పుస్తక సమీక్షలు వివిధ రచయితలపై బేరీజులు వేసేవాళ్ళం. మేము ఇరువురం కలిసి మైలాపూరులో చందూర్, మాలతీచందూర్ దంపతులను కలియడం ఆహ్లాదకరమైన అనుభవం. వారి ఇంట్లోనే చిన్న ప్రెస్సు వుండేది. 'జగతి' అనే మాసపత్రికను ఒక గృహపత్రికగా నడిపేవారు. అందులో ముచ్చట్లు ప్రస్తావిస్తూ, ప్రచురించే ధోరణి పలకరింపులతో వుండేది.

దాశరథి కొన్నాళ్ళు ఆలిండియా రేడియో మదరాసు కేంద్రంలో ఉన్నారు. అక్కడకు వెళ్ళి, ఆయనతో కూడా కాలక్షేపం చేసేవారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి ఇంటికి వెళ్లగా ఆయన గొంతువద్ద ఎలక్ట్రానిక్ యంత్రం పెట్టుకుని మాట్లాడటం ఒక అనుభవం. సోవియట్ యూనియన్ రాయబార కార్యాలయం వద్దకు వెళ్ళినపుడు సెట్టి ఈశ్వరరావును కలుసుకునేవాళ్లం. ఆయన కొన్నాళ్లు, మాస్కోలో కూడా పనిచేసి వచ్చారు. అమెరికా రాయబార కార్యాలయంలో తెలుగు విభాగంలో పనిచేసిన బి.ఎస్.ఆర్. కృష్ణ, కె.వి. సుబ్బయ్య, వల్లభజోస్యుల భాస్కరరావుల వద్దకు వెళ్ళేవాళ్ళం . ఆంజనేయులుకు సంగీత ప్రీతి ఎక్కువ. అందువలన మదరాసులో జరిగే సంగీత కచేరీలకు నన్ను కూడా తీసుకు వెళ్ళేవారు. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులను వినడం అలా తటస్థించింది. ఆ రోజులలో ఫుల్ బ్రైట్ స్కాలర్ షిప్పులు మంజూరు చేసే అమెరికా కార్యాలయం మదరాసులో వుండేది. అందులో ద్వివేదుల నరసింగరావు పనిచేసేవారు. ఆయన్ను ఆయన భార్య విశాలాక్షిని తప్పనిసరిగా కలిసేవాళ్ళం. నర్సింగరావు మానవవాది ఎమ్.ఎన్.రాయ్ అభిమాని. అదికూడా ఒక ప్రత్యేక ఆకర్షణ. ఆ విధంగా మదరాసు వెళ్ళినప్పుడల్లా అనుభవాన్ని సంతరించుకోవడం ఆంజనేయులు ద్వారా సాధ్యమయింది. అలాంటి అనుభవమే ఆయన ఢిల్లీలో పనిచేస్తున్నప్పుడు కూడా నాకు కలిగింది.

(మరో సాహితీమూర్తితో సహవాసం గురించి వచ్చే సంచికలో)

●●●

COMMENTS